# 3. కలల పంట

ఆదియ్య మనసు ఆనందంతో తేలిపోతోంది. మనిషి మహా సంతోషపడి పోతున్నాడు.

చల్లగా, ఆహ్లాదకరంగా పైరగాలి తోలుతోంది.

ఆదియ్య పొలం నాలుగు మూలలా ఒకసారి తిరిగి వచ్చాడు.

మనసు సంతోషంతో, సంతృప్తితో నిండిపోయింది.

శనగ పంట విరగపండింది.

ఒక్కో మొక్కా దాదాపు అడుగున్నర ఎత్తు పెరిగింది. ఆ పెరిగిన మొక్కకి గుత్తులు గుత్తులుగా కాయలు!

మొక్క బాగా మట్టకట్టి తెగ కాసింది.

నాలుగయిదు మొక్కలకే ఒక కేజీ శనగలు అయ్యేలా ఉంది పంట.

ఇంతకు ముందు ఎకరానికి ఎనిమిది బస్తాలు అయ్యే శనగలు ఇప్పుడు పది బస్తాలు కావచ్చనుకున్నాడు.

ఈ ఏడాది పురుగు తక్కువ. వర్షాలు కూడా సకాలంలో కురిసాయి. వాతావరణం కూడా శనగ పంటకి బాగా అనుకూలంగా ఉంది. పది బస్తాలు గట్టిగా పండుతాయి.

ఎకరానికి పది లెక్కన 15 ఎకరాలకీ 150 బస్తాలు - పోనీ పది ఎక్కువా తక్కువగా అనుకున్నా 130, 140 బస్తాలు గట్టిగా కావచ్చనుకున్నాడు.

మనసు ఆనందంతో నిండిపోయింది.

పొలంలో పంట బాగుంటే అంతకు మించిన ఆనందం రైతుకి ఏం ఉంటుంది?

వచ్చే డబ్బు మనసులోనే లెక్క వేసుకున్నాడు.

పోయిన ఏడాది బస్తా శనగలు పద్నాలుగు వందల ధర మీద కొనుగోలు చేశారు. ఈ ఏడాది ధర ఎంత ఉంటుందో?

విత్తనాలు ఎద పెట్టుకునేటప్పుడు ఇరవైఐదు వందల మీద చాలామంది కొనుక్కు వచ్చారు. విత్తనాల సమయంలో ఉన్న ధర పంట రైతు చేతికి వచ్చిన తరుణంలో ఎలాగూ ఉండదు.

ఈ ఏడాది నిరుటికంటే ఖర్చులు పెరిగాయి. పురుగుమందుల ధరలూ, సత్తువల ధరలూ, కూలీ ఇవన్నీ పెరిగాయి.

ఇవి పెరిగినప్పుడు శనగలకి కూడా కొంత ధర పెరుగుతుంది కదా అనుకున్నాడు ఆదియ్య.

బస్తా పదిహేను వందలు ఉన్నా తనకి కనీసం రెండు లక్షల రూపాయలు వస్తాయి కానీ తగ్గవు!

ఇతర పంటల్లో – మొక్కజొన్న, కందులు, పెసలు ఇవి తక్కువ పొలంలో వేసినా వీటికి లక్ష రూపాయలు వస్తాయి.

ప్రతిఏడూ ఇలా ఉంటే ఇక రైతుకి కావాల్సిందేం ఉంది?

నిరుడు పొలంలో మిగలలేదుకానీ, అంతకుముందు రెండేళ్ళూ ఏడాదికి లక్ష చొప్పున మిగిలాయి.

నిరుడు పండిన పంటకీ, పెట్టిన పెట్టుబడికీ సరిపోయింది. హళ్ళికి హళ్ళీ, సున్నకి సున్నా.

చాలా కాలం వాన లేదు. తరువాత ఎడతెరిపి లేని వానలు! ముందు అనావృష్టి ,ఆపై అతివృష్టి . అలా వాతావరణం అనుకూలించక ఎక్కువ ఆదాయం రాలేదు.

ఈ ఏడాది పంట బాగుందీ, డబ్బులు బాగా వస్తాయి!

అంతకు ముందు రెండేళ్ళు మిగిలిన రెండు లక్షలు రాంబాబు దగ్గర ఉన్నాయి.

రాంబాబు అంటే ఆ వూరికి బ్యాంకు లాంటివాడే!

రైతులకి ఆపద్బాంధవుడు!

రైతులందరూ రాంబాబు అంటే కలవరిస్తుంటారు. పోయి అప్పు అడిగినవాళ్ళకి లేదనకుండా ఇస్తాడు. ఎంత మంచిగా ఇస్తాడో, అంత మంచిగానే వసూలు చేసుకుంటాడు.

ఎంతవాడు ఎంతయ్యాడు అని ఆదియ్య అతనిని గురించి ఆలోచిస్తూ ఆశ్చర్యపోయాడు.

రాంబాబు మొదట్లో ఎరువుల కొట్లో గుమస్తాగా ఉండేవాడు. రాంబాబుకీ, కొట్టు యాజమానికీ కుదరక బయటకి వచ్చాడు. వచ్చి సొంతంగానే ఎరువుల కొట్టు పెట్టుకున్నాడు.

అంతకు ముందు రైతులతో ఉన్న పరిచయాల్ని వృద్ధి చేసుకున్నాడు.

ఎరువుల డీలర్లతో ఉన్న పరిచయాలతో మందులు అప్పుగా తెచ్చి రైతులకి ఇచ్చేవాడు.

ఇవ్వాళ రైతులకి తలలో నాలుక అయ్యాడు రాంబాబు.

అతని మాట నమ్మకం, మనిషి నమ్మకం! అందరితో ఆప్యాయంగా కలిసిమెలిసిపోయాడు.

రైతులందరూ అతనంటే అభిమానం పెంచుకున్నారు.

పొలంలో వేసే విత్తనాలూ, సత్తువ మందులూ, పురుగు మందులూ అన్నీ రాంబాబు వద్దనించి కొనాల్సిందే! చివరికి పండిన పంటని కూడా రాంబాబుకే అమ్ముతారు. లేదా తను కమీషన్ తీసుకుని వేరే వాళ్ళకి అమ్మిపెడతాడు.

మొదట్లో పెద్దగా ఆస్తిపాస్తులు లేనివాడే! ఈ ఐదారేళ్ళలో దాదాపు పదిహేను లక్షలు సంపాయించాడు.

రైతుల డబ్బు అతని వద్ద ఇరవై లక్షల పైచిలుకు ఉంది.

ఆ డబ్బే పెట్టుబడిగా వాడుకుంటూ వ్యాపారాన్ని పెంచుకున్నాడు.

రైతులకి కూడా అతని వద్ద డబ్బు ఉంచడం మంచిదే! శనివారం, ఆదివారం లేదూ, అర్ధరాత్రీ అపరాత్రీ లేదూ – ఏ జామున ఏ నిమిషంలో కావాలంటే ఆ నిమిషంలో ఇస్తాడు.

బ్యాంకు వాళ్ళు రూపాయి వడ్డీ అయితే రాంబాబు రూపాయన్నర వడ్డీ ఇస్తాడు. ఇక కావాల్సిందేం ఉంది?

అందుకే రైతులు కూడా మిగిలిన డబ్బు మిగిలినట్టే రాంబాబు వద్ద ఉంచుతున్నారు.

ఆలోచిస్తూ ఇంటికి వెళ్ళాడు ఆదియ్య.

"శనగ కోత ఎన్ని రోజులకి వచ్చిద్దయ్యా ?" భార్య కాంతమ్మ అడిగింది.

"కోతకి వచ్చినట్టేనే! రెండు రోజుల్లో కోపిద్దాం!"

"అయితే శనగలు పట్టుకోవడానికి గోతాలు చూసుకోవద్దా! అప్పటికప్పుడు గోతాలు కావాలంటే ఎక్కడ్నించి వస్తయ్యి? ముందే చూసి పెట్టుకుంటే బాగుండుద్ది కదా?"

"రాంబాబుని అడిగానే! నిన్ననే పది వందల గోతాలు తెచ్చాడంట! మంచియ్యి చూసి తీసకపొమ్మన్నాడు!"

"మనకి ఎన్ని గోతాలు కావాల్సి వస్తయి?"

"నూట నలభై తీసుకొస్తా! మనం గోతాలకి డబ్బులు ఇచ్చే పనిలేదులే! రేపు వాడికేగా అమ్మేది, ఆ గోతాల్లోనే పట్టుకునిపోతారు."

"రేప్పొద్దున్నే తీసకరా గోతాలు. మళ్ళీ అయిపోతే ఇబ్బందిపడతాం. గోతాలు తెచ్చేటప్పుడు డబ్బుల యవారం కూడా ఒకసారి గుర్తుచెయ్యి"

"ఐదార్రోజులనాడే అడిగా! ఇయ్యేడు డబ్బు మొత్తం అవసరంరా, డాబా కట్టిచ్చుకోవాలీ, పిల్లలకి పెళ్ళిళ్ళు చేయాలని చెప్పా! నీకు ఎప్పుడు అవసరం అయితే అప్పుడు తీసకపో అన్నా అన్నాడు"

"మన డబ్బు రెండు లక్షలకీ ఈ మూడేళ్ళనించీ ఎంత వడ్డీ వచ్చిద్దంటావు?"

"ఏమో, లెక్కచూస్తే తెలిసిద్దిగా! అమ్మాయికి కట్నం మనం శక్తికి మించి పెడతన్నామేమోననిపిస్తందే నాకు! రొక్కం రెండు లక్షలంటే మాటలా? మళ్ళీ బంగారం కూడా పెడతంటమీ!"

"ఎక్కువో తక్కువో కుదిరింది కదా! పిల్లకి ఒకసారే ఇస్తామా, మాటిమాటికీ ఇస్తామా? ఉజ్జోగం ఉన్న అబ్బాయి దొరకాలంటే ఈ రోజుల్లో సామాన్యమా?"

"నిజమే అనుకో"

"మన అమ్మాయి అదృష్టం బాగుండి మనకీ సంబంధం కుదిరింది. పొలాలు పండితే ఒక ఏడు పంటే కదయ్యా, మనం కట్నం ఇయ్యడం! అబ్బాయికి కూడా తొందరగా కుదిరితే బాగుణ్ణు!"

"తొందరేముందిలేవే? ముందు ఈ ఇల్లు పీకేసి డాబా కట్టిచ్చుకోవాలి కదా? ఎట్టలేదనుకున్నా డాబా అయ్యేసరికి నాలుగు నెల్లు పట్టిద్ది! ఈ లోపు అబ్బాయికీ ఎక్కడో చోట కుదరకపోయిద్దంటలే!"

"శ్రావణమాసం లగ్గాలకన్నా డాబా పని అయితే ఆ నెల్లో చేసుకోవచ్చు పెళ్ళిళ్ళు! మాటలు అనుకున్నంత తొందర కాదుగా ఇల్లు కావటం అంటే!"

"ముందు పొలంలో పని అడ్డం లేకుండా చేసుకుంటే తొందరగా దిగొచ్చు ఇంటి పనిలోకి!"

తరువాత మూడు రోజులకి ఆదియ్య కూలీల్ని తీసుకుపోయి శనగపంట పీకించాడు.

ఒకవైపు పంట పీకుతుంటే, మరోవైపు కల్లానికి వేస్తున్నారు కూలీలు. పదిరోజులకి పండిన శనగలు మొత్తం ఇంటికి చేర్చుకున్నారు.

"150 బస్తాలు అవతయ్యనుకున్నాం! 130 అయ్యే సరికి గగనం అయింది" భార్యతో అన్నాడు ఆదియ్య.

"పొలం ఎక్కువ మీద దిగుబడి తగ్గిద్దలయ్యా! ఎకరం, రెండెకరాలు యేసుకున్నోళ్ళు జేగర్తగా చేసుకుంటారు. ఇంత పొలం బారు మీద ఎకరానికి పది బస్తాలు కావాలంటే మాటలా?"

"తొందరగా అమ్మేసుకుంటే మనకి ఒక పని అయిపోయిద్ది! ధరలు కూడా రోజురోజుకీ తగ్గుతున్నయ్యి కానీ పెరుగుతున్నట్టు లేదు"

"ఎంతంటన్నారేంది ఇప్పుడు ధర?"

"పదమూడు వందలంటన్నారే! వారం రోజుల నాడు పదిహేను వందలు చేసి పట్టేరంట కొన్ని ఊళ్ళలో. ధర ఇంకా తగ్గిద్దంటన్నారు!"

"ధర పెరిగేదీ తరిగేదీ ఎవురికి తెల్సులే? ఎవురు చూసొచ్చారు అది! అయితే ఇప్పుడు అన్నిచోట్ల ఎక్కువ శనగ పంటే యేసారయ్యా!"

"నిజమే, దేశంలో ఎక్కువగా శనగపంటే! అదీ ఎల్లోకొల్లాగా పండింది, ఇంక ధరేం ఉండిద్దయితే మరి? అమ్ముకోవడమే మంచిది. సరుకు కచ్చాపచ్చా మీద యేస్తే తూకాలు వస్తయ్యి!"

"ఏం అన్నా... శనగలు తూకం యేస్తావా, రేటు వచ్చిందాకా ఉంచుకుంటావా?" అంటూ రాంబాబు వచ్చాడు.

"రారా... ఆ యవారమే అనుకుంటన్నాం. ఇప్పుడు ఎంత చేసి కొంటన్నారు?"

"పదమూడు వందల మీద ఉందన్నా ఇప్పుడు రేటు. ఇంకా డవున్ కావచ్చుంటన్నారు! ఇయ్యేడు ఎక్కువ ఈ పంటేనాయె! ఇంక వారం పది రోజులాగితే పది వందలు చేసి కొనేవాడు కూడా ఉండరంటన్నారు మార్కెట్లో! ఏదయినా ఈ కాకలోనే అమ్ముకోవటం మంచిది!"

"అయితే మాయ్యి కాటాలు యేయమంటావా?"

"నీ ఇష్టం కదన్నా! కొన్ని శనగలు శాంపుల్ తీసి చూపెట్టు"

అక్కడక్కడా కొన్ని బస్తాల్లోనించి శనగలు సివుకుతో తీసి ఇచ్చాడు. రాంబాబు ఆ శనగల్ని చూసి చిన్న పొట్లం కట్టుకున్నాడు.

"పంట బ్రహ్మాండంగా ఉందన్నా! చుట్టుపక్కల ఊళ్ళు కూడా తిరిగి నేను శనగలు కొంటన్నాకదా! ఇంత మాత్రపు గింజ నాకు ఎక్కడా తగల్లా! సరుకు భేషుగ్గా ఉంది"

"ఇదేకాదు, ఏదయినా పంట బాగుండకపోతే నాకు అసలు నచ్చదు. పొలానికి బలాలు పెట్టడంలో కానీ, కల్లాల్లో కానీ, మందులు వెయ్యటంలో కానీ ఏదయినా సిస్టంగా ఉంటేనే నాకు బాగుండిద్ది. నా మనసుకి నచ్చిద్ది" ఆదియ్య ఉత్సాహంగా, సంతోషపడిపోతూ అన్నాడు.

"అయితే కాటాలు యేసుకోమంటావా మరి?" మళ్ళీ అడిగాడు రాంబాబు.

"ఏమే?" భార్య వైపు చూశాడు ఆదియ్య.

"నన్నడుగుతావేందయ్యా, నాదేముంది? ధరలు తగ్గొచ్చంటన్నాడుగా, కాటాలు యేస్తేనే పోయా!"

"నువ్వు కాటాలు యేస్తానంటే వదినది ఏముందన్నా! నీ మాటకి ఎదురుచెప్పిద్దీ? నువ్వెంత అంటే వదినా అంతేనాయె!"

"రేప్పొద్దున్నే వచ్చి కాటాలు యేసుకోండి. మొన్న చెప్పాగా, పిల్లల పెళ్ళిళ్ళ యవారం, డాబా కట్టిచ్చుకునే యవారం!"

"బలేవోడివన్నా! నువ్వు అడగాలా? ఇన్నిసార్లు చెప్పాలా? డబ్బు నీది. నీకు ఏ నిమిషంలో కావాలంటే ఆ నిమిషంలో తీసుకో!"

మరుసటి రోజే రాంబాబు ముఠావాళ్ళని తీసుకొచ్చి కాటాలు వేసుకున్నాడు.

అనుకున్నట్టే 132 బస్తాలు శనగలు అయ్యాయి.

"మొత్తం ఎన్ని వేలు వస్తయ్యి?" ఆదియ్య అడిగాడు.

రాంబాబు లెక్కచూసి చెప్పాడు. "లక్షా 67 వేలా 440 వస్తయ్యన్నా! కింటా పదమూడు వందలు. బస్తాకి తరుగు కేజీ తీసెయ్యాలిగా!"

"సరే, డబ్బు మొత్తం పద్దులో రాసుకో! రేపట్నించీ వడ్డీ వచ్చిద్దిగా! డాబా మొదలు పెట్టినప్పుడు కొంతా, పెళ్ళిళ్ళనాటికి మిగతా డబ్బు ఇద్దువు"

మరుసటి రోజు పాత బాకీ లెక్క చూసుకున్నారు. అసలు రెండు లక్షలకీ ఈ రెండేళ్ళనించీ వడ్డీ అరవై వేలు అయింది.

"ఈ నాలుగు రోజుల నుంచీ చాలా లారీల సరుకు కొంటన్నావట్టుగా ఉంది కదరా రాంబాబు?"

"అవును అన్నా! రెండు మూడు నెల్లు ఆగితే రేటు వచ్చిద్దని ఆశ. నిరుడు ఇట్నే స్టాకు చేసి పెడితే మూడు లక్షలు మిగిల్నియ్యి! సరుకు కొని మార్కెట్ యార్డ్ గోడవున్లో స్టాక్ చేసి పెడతన్నా!"

పద్దెనిమిది వందలు ఉన్న కందులకి వంద రూపాయల ధర అధికం పెట్టి కొనుగోలు చేశాడు. అలాగే పద్నాలుగు వందలు ఉన్న పెసల్ని పదిహేను వందల ధర మీద కొన్నాడు.

ఆ ఊరు, చుట్టుప్రక్కల గ్రామాల్లో రైతుల వద్ద నించి చాలా సరుకు కొనుగోలు చేశాడు. అయితే సరుకు ఎక్కువ అప్పుగానే కొన్నాడు. డబ్బు నెలా పదిహేను రోజులకి ఇచ్చే షరతు!

ఆదియ్య ఇంటికి వాళ్ళ కూతురికి కుదిరిన సంబంధం వాళ్ళు వచ్చారు.

"అబ్బాయికి తొందరగా పెళ్ళిచేయాలి. శ్రావణమాసం దాకా ఆగాలంటే కుదరదు. అక్కడ హోటల్లో తిండి సరిగా గిట్టక ఇరవై రోజులు మంచాన పడ్డాడు. మీరు డాబా కట్టుకున్నదాకా ఉండాలంటే మాకు కుదరదు! పిల్లకి పెళ్ళి చేసిన తరువాతనే డాబా కట్టుకోండి. మీకు ఇప్పుడు వల్లకాదంటే చెప్పండి, మేం ఇంకో సంబంధం చూసుకుంటాం!" తెగేసి చెప్పారు.

కాంతమ్మా, ఆదియ్యా ఆలోచించారు. చర్చించుకున్నారు.

"సరే, వాళ్ళు గట్టి పట్టు పట్టినప్పుడు మనం ఏం చేస్తాం? ఎప్పుడైనా పెళ్ళి చేయాల్సిందే కదా! ఆగితే ఏమొచ్చిద్ది? నెమ్మదిగానే డాబా కట్టుకుని అప్పుడే అబ్బాయికి చేసుకుందాం?" అనుకున్నారు.

లగ్నాలు పెట్టుకున్నారు.

డబ్బు కోసం రాంబాబు దగ్గరికి వెళ్ళాడు ఆదియ్య.

"వాళ్ళ అబ్బాయికి ఇప్పుడికిప్పుడే పెళ్ళిచేయాలని గొంతు మీద కూర్చున్నార్రా! లగ్గాలు పెట్టుకున్నాం. పది రోజులుంది పెళ్ళి. రెండు రోజుల్లో గుడ్డలకి పోవాలి. పెళ్ళి సరుకులు తెచ్చుకోవాలి. ఇప్పుడు నలభైవేలు ఇస్తే పెళ్ళి రెండు రోజులుందనగా కట్నం డబ్బురెండు లక్షలు ఇద్దువు!" ఆదియ్య చెప్పాడు.

"సరేలే అన్నా! ఇయ్యాల శనివారం. రేపు ఆదివారం బేంకి ఉండదు. ఎల్లుండి సోమవారం తీసుకుందువులే నలభైవేలూ."

"సరే, ఎల్లుండన్నా ఇస్తే మంగళవారం నాడు పోతాం గుడ్డలకీ, సరుకులకీ!"

శనివారం ఒక్కరోజే రాంబాబు మూడు లారీల సరుకు కొన్నాడు. అంతకుముందు కూడా దాదాపు ఇరవై లారీల సరుకు అపరాలు అప్పుమీదనే కొన్నాడు.

కొన్న సరుకు మొత్తం అమ్మివేసి డబ్బు చేసుకున్నాడు. దాదాపు ముప్పై లక్షలు. ఆదియ్య లాంటి రైతులు దాచుకున్న డబ్బు ఇరవై లక్షలు ఉంది.

భార్యనీ, ఇద్దరు కొడుకుల్నీ అంతకు రెండు రోజుల ముందే ఎక్కడికో పంపించాడు.

తను కూడా ఆదివారం సాయంత్రం చక్కగా స్నానంచేసి, మంచి బట్టలు వేసుకుని... అంతే. అడ్రసు లేదు.

ఇల్లూ, ఇంట్లో సామాను అలాగే ఉంది, ఫ్రిజ్, కలర్ టీవీలతో సహా!

భార్యకి చేయించిన యాభై సవర్ల బంగారు ఆభరణాలు, అంతకు ముందే భార్య వెళ్తూ తీసుకుపోయింది.

ఆదియ్యే కాదు, ఆదియ్య లాంటి రైతులు చాలామంది తినీతినకా, ఎన్నో కష్టాలు పడుతూ, ఎంతో శ్రమచేస్తూ, ఎన్నో ఆశలతో, ఎన్నో కలలతో, ఎన్నో అవసరాల కోసం ఎంతో ప్రాణప్రదంగా, ఎంతో నమ్మకంగా దాచిపెట్టుకున్న డబ్బుని రాంబాబు నమ్మకంగా కాజేసుకుపోయాడు.

రాబందు ఎగరేసుకుపోయింది. గద్ద తన్నుకుపోయింది.

ఆదియ్య ఇంటిని గురించీ, కన్నబిడ్డల పెళ్ళిళ్ళ గురించీ, తమ భావిజీవితాన్ని గురించీ కన్న కలలు కల్లలుగానే మిగిలిపోయాయి. ఆ కలలు పగటి కలలైపోయాయి.

**ఆదివారం ఆంధ్రజ్యోతి - 08 సెప్టంబర్, 1998**